క్లుప్తంగా

నేడు మురుగులమ్మ జాతర



మురుగులమ్మ

అంబాజీపేట: ఇరుసుమండలో వేంచేసియున్న మురుగులమ్మ అమ్మవారి జాతరను సోమవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో గరగ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం అమ్మవారి తీర్థం జరుగుతుందన్నారు.

వాడపాలెంలో రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో బండారు సందీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య తెలిపారు. సందీప్ జయంతి పురస్కరించుకుని మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల వైద్య నిపుణులను తీసుకువచ్చి సందీప్ చారిటబుల్ ట్రస్ట్ భవనం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు చిట్టిబాబు తెలిపారు. 15 రకాల వ్యాధులకు సంబంధించిన 15 మంది వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. వాడపాలెం, వానపల్లి, కొత్తపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిట్టిబాబు కోరారు.

చర్చిల్లో గొల్లపల్లి ప్రార్థనలు



చర్చి ప్రార్థనలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం, గొంది తదితర చర్చిల్లో ఆదివారం దైవజనులు జయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. గొంది చర్చిలో దైవజనులు గెడ్డం చిట్టిబాబు, అంతర్వేదికర చర్చిలో దైవజనులు విజయారత్నం ఆధ్వర్యంలో గొల్లపల్లికి మద్దతుగా ప్రార్థనలు చేశారు. వీటితో పాటు అంతర్వేది చొప్పలవారి గ్రూపు చర్చిలోని ప్రత్యేక ప్రార్థనల్లో సూర్యారావు పాల్గొన్నారు. ఎంపీటీసీ కొల్లాబత్తుల నాని, నాయకులు సరెళ్ల విజయ్ ప్రసాద్, ఈద రవిరెడ్డి, కొల్లాబత్తుల చిట్టిబాబు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.11 వేల సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో వెన్నెముకకు గాయమైన బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.11 వేల నగదు సాయంగా అందజేశారు. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన పితాని లక్ష్మి ఉపాధి హామీ కూలి పనికి వెళ్లినపుడు కాలువరేవులో జారపడిపోవడంతో వెన్నెముక విరిగింది. ఆపరేషన్ చేస్తే ప్రమాదమని సంవత్సరం వరకు మంచం మీదే ఉండాలని డాక్టర్లు తెలిపారు. ఆమె భర్త రావులపాలెంలో వాచ్‌మన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వైద్యం కోసం సాయం చేయమని కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరడంతో వారు దేవరపల్లిలోని లక్ష్మి ఇంటికి వెళ్లి రూ.11 వేల నగదు, 25 కేజీల బియ్యం బస్తా సాయంగా అందజేశారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



చింతలూరు నూకాంబిక ఆలయంలో క్యూలో బారులు తీరిన భక్తులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. ఆదివారం సెలవు కావడంతో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి అధికం కావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. చిన్నారులతో కాగడాలు వెలిగించి వారకల్లు, తుళ్లబిళ్లను దిష్టి తీయించారు. గ్రామ పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుధ్యాన్ని నెలకొల్పుతున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా ఆలయంలో కనీస సౌకర్యాలను కల్పిస్తున్నామని దేవదాయశాఖ ఈఓ ఎంఎస్ఆర్ కష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు తెలిపారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ప్రచారం

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో పి.గన్నవరం నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, అమలాపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఓటు గ్లాస్ గుర్తుపై, ఎంపీ ఓటు సైకిల్‌గుర్తుపై వేసి గెలిపించాలని వారు అభ్యర్థించారు.

మంచి చేశాం.. మీ ముందుకు వస్తున్నాం

- ర్యాలిలో ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి



ర్యాలిలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి



ర్యాలిలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

ఆత్రేయపురం: మంచి చేశాం. మళ్లీ మీ ముందుకు వస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే మంచి జరుగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ర్యాలిలో ఆయన ఇంటింటా పర్యటించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ప్రతి గడపకు అందించామన్నారు. గత పాలకుల్లా ప్రజలను మోసం చేయకుండా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించామని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజలు జరిగిన మంచిని గమనించి మంచి చేసే జగనన్న ప్రభుత్వానికే మరలా పట్టం కట్టాలని జగ్గిరెడ్డి కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

మండలం ర్యాలి గ్రామంలో ఆదివారం టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీ పార్టీలోకి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో భారీ చేరికలు జరిగాయి. పేర్చేర్ల నాగరాజు, పి.సాయిరాం, పిటకా దుర్గారావు, ఈలి రామన్న, బొచ్చల రామకృష్ణ, ఉందర్తి చిట్టిబాబు, ఉండ్రాజవరపు నరసింహ మూర్తి, కొమ్మర శ్రీను, మల్లవరపు సత్యానారాయణ తదితరులు కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ ఈ సారి కూటమి ఓటమి తప్పదని, సార్వత్రిక ఎన్నికల్లో మరలా జెండా ఎగరవేసి ప్రభుత్వాన్ని ఏర్పరిచేది వైఎస్సార్ సీపీనే అన్నారు. తామంతా జగ్గిరెడ్డి వెంటే నడుస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల ఇంటింటా ప్రచారం

ఆలమూరు: కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులు చేపడుతున్న ప్రచారానికి విశేష ఆదరణ లభిస్తుంది. మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. నిరుపేదల అభ్యున్నతికి సీఎం జగన్ ప్రకటించిన నవరత్న పథకాల కొనసాగింపు, మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సీఎం జగన్ మళ్లీ అధికారం చేపట్టిన వెంటనే ప్రస్తుతం అమలు చేస్తున్న వస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గతంలో మాదిరిగా పింఛన్లను ఇంటి వద్దకు అందిస్తామన్నారు. మాజీ సీఎం చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో బూత్ కమిటీ అధ్యక్షుల సహకారంతో జగన్ ప్రజాకర్షక పథకాలను ప్రజలకు వివరించి ఆయా కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను సవివరంగా విశదీకరించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



కొత్తపేటలో ఉత్తమ విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘ నాయకులు



విద్యార్థిని శ్రీరామదుర్గను అభినందిస్తున్న కాపు ఉద్యోగ సంఘం ప్రతినిధులు

కొత్తపేట: ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు, జిల్లా సంఘం కార్యదర్శి ఆదివారపుపేట వెంకటేశ్వరరావు సూచించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభినందన సత్కారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా చదువుకోవాలని సూచించారు. గత ఐదేళ్లుగా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన బీసీ విద్యార్థులకు, ఫీజులు చెల్లించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అనారోగ్య బాధితులకు, వివిధ ప్రమాదాల బాధితులకు సామాజిక బాధ్యతగా ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నామన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా, మండల బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆర్‌వీకేడీ ప్రసాద్, ఎండీ ఖాజామొహిద్దీన్, సీహెచ్ మూర్తి, గుత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: పెదపట్నంలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గిడుగు శ్రీరామదుర్గ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని కోనసీమ జిల్లా స్థాయిలో ఐదో ర్యాంకు సాధించడం హర్షణీయమని కాపు ఉద్యోగ సంఘం గౌరవాధ్యక్షుడు చిక్కం ప్రసాద్ పేర్కొన్నారు. పెదపట్నంలంకలో ఆదివారం జరిగిన సమావేశంలో విజయదుర్గను కాపు ఉద్యోగ సంఘం ఘనంగా సత్కరించింది. రూ.5 వేలు నగదు ప్రోత్సాహం అందించి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు. సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు కొమ్ముల రాఘవరావు, వలవల రాజా, నల్లా రామకృష్ణ, శ్రీను, పైడిపర్తి చిన్ని, సంధ్యాల నాయుడు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్ కావాలంటే జగనే రావాలి



రామేశ్వరంలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో కిట్లు ఇస్తున్న మోహన్

సఖినేటిపల్లి: రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుని, పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని జగనన్న కన్వీనర్ల సారథి నల్లి మోహన్ అన్నారు. రామేశ్వరంలో బళ్ల లక్ష్మణ్ రావు అధ్యక్షతన ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కోర్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో సమావేశం జరిగింది. సిద్ధం కిట్లను మోహన్ వారికి పంపిణీ చేశారు. అనంతరం నల్లి మోహన్ మాట్లాడుతూ, బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. అలాగే పార్టీపై ఓటర్లలో మరింత చైతన్యం తెచ్చేలా కూడా బూత్ కమిటీ సభ్యులు చూడాలని కోరారు. ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు ఫ్యాను గుర్తులపై రెండు ఓట్లు వేసేలా తగిన కృషి చేయాలని మోహన్ కోరారు. చెల్లింగి నాగరాజు, కొల్లాబత్తుల క్రాంతికుమార్, ఇళ్ల శ్రీను, గొల్లమందల అర్జునరావు, ఎల్.సుబ్బరాజు, మేడిది శ్యామ్‌కుమార్, మత్తి నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్



అంబాజీపేటలో సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం అంబాజీపేటలో నిర్వహించే ఎన్నికల ప్రచారానికి సంబంధించి సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్‌ను ఆదివారం సాయంత్రం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సెంటర్‌లో నిర్వహించే సభ ప్రాంగణం వరకు పోలీస్ సిబ్బందితో ట్రయల్ రన్ నిర్వహించారు.

మహోన్నత శక్తి అంబేడ్కర్



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బిక్కు బోధి హీన్

అయినవిల్లి: అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేసిన మహోన్నత శక్తి డా. బీఆర్ అంబేడ్కర్ అని బిక్కు బోధి హీన్ అన్నారు. అయినవిల్లి మండలం వెలువలపల్లిలో డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని న్యాయవాది బడుగు భాస్కర్ జోగేష్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. బిక్కు బోధి హీన్ మాట్లాడుతూ బౌద్ధం హింసకు తావులేని సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ హక్కుల పోరాటం మొదలైన వందేళ్ల తర్వాత మానవ హక్కులు తిరోగమన దిశలో ఉండటం వాంఛనీయం కాదన్నారు. దీనికి ప్రభుత్వ విధానాలే కాక బాధిత సమూహాల నిర్లక్ష్య వైఖరి కూడా కారణమని అన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ వర్తమాన సమస్యలకు అనుగుణంగా బాధితులు తమ పోరాటం రూపాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు జె.భీమారావు, గోసంగి బంగార్రాజు, ఎస్.సత్యనాయణ మాట్లాడుతూ అంబేడ్కర్ ఈ దేశంలోని సర్వ సమస్యలకు పరిష్కారం అని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పరమట నాని, ఎంపీటీసీ సీహెచ్ సాయిలక్ష్మి, పి.మోహన్, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ వర్ధంతి

పి.గన్నవరం: నిరతాన్నధాత్రి డొక్కా సీతమ్మ వర్ధంతిని స్థానిక అక్విడెక్టు పార్కులో ఆదివారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. సీతమ్మ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు డొక్కా నాథ్‌బాబు, వేమన మల్లేశ్వరరావు, కేఎస్ఎన్ రాజు, ఎ.లాల్‌బాబు, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పది నాణేన్ని తిరస్కరించడం చట్ట విరుద్ధం

యానాం: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా విడుదలైన పది రూపాయల నాణేన్ని తిరస్కరించడం చట్ట విరుద్ధమని పుదువై వెట్టక సభ పార్టీ నేత గుణశేఖరన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది నాణెం చెల్లుబాటుపై అనేక వదంతులు రావడంతో వ్యాపారులు తీసుకోవడం మానేశారన్నారు. దీంతో ఇటీవల రిజర్వు బ్యాంకు సైతం పది నాణేలు చెల్లుబాటవుతాయంటూ ప్రకటన జారీ చేసిందన్నారు. పుదుచ్చేరి, కారైకల్, యానాం అధికార యంత్రాంగాలు సైతం ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని కోరారు.

ఘనంగా కుంకుమ పూజలు



లూటుకుర్రులో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ దేవత పెద్దింట్లమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. పలువురు ముత్తైదువలు ఈ పూజలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగులతో ఆలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. అమ్మవారి జాతర మహోత్సవాలు మే 2వ తేదీ గురువారం వరకు ఐదు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం



ప్రసంగిస్తున్న సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: బాల బాలికల్లో నాటుకునే నైతిక విలువలతోనే సంస్కారవంతమైన సమాజం సాకారమవుతుందని అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో బాల బాలికలకు ఏర్పాటైన శ్రీసత్యసాయి బాల వికాస్ ఉచిత వేసవి శిక్షణా తరగతులను డాక్టర్ ప్రభాకర్ ఆదివారం ఉదయం ప్రారంభించి ప్రసంగించారు. డాక్టర్ ప్రభాకర్‌తో పాటు స్థానిక ఆంధ్రా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి సత్యసాయి చిత్రపటానికి పూజలు చేశారు. జిల్లా సత్యసాయి బాల వికాస్ కేంద్రాల సమన్వయకర్త శిష్టా గుణరంజన్ శిక్షణా తరగతులకు హాజరైన బాలబాలికలకు కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల వికాస్ జిల్లా మహిళా సమన్వయకర్త భవాని, బాల వికాస్ ప్రతినిధి విజయబాల తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న భానుడు



గొల్లవిల్లిలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఉప్పలగుప్తం: మే నెల రాకుండానే భానుడు భగ్గుమంటున్నాడు.. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు ఉక్కబోతకు తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. గత వేసవిలో ఉష్ణోగ్రత 43 డిగ్రీలు దాటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఏడాది సైతం అదే రీతిలో ఉష్ణోగ్రతలు ఉండడంతో పాటు తీవ్ర వడగాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఎండల తీవ్రతకు తట్టుకోలేక మధ్యాహ్న సమయంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపారులు సైతం మధ్యాహ్నం సమయంలో దుకాణాలు మూసేసి సాయంత్రం 5 గంటలు దాటాకే తెరుస్తున్నారు. తప్పనిసరై రోడ్డుపై ప్రయాణించే వారు సైతం ఎండ తాకిడికి తట్టుకోలేక నీడ కోసం అల్లాడుతున్నారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి గ్రామాల్లో కనిపించిన ఈ చిత్రాలు ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.